క్లుప్తంగా

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రముఖ సంఘ సేవకులు నియమితుల్లా మృతి



విశాఖ–లీగల్: ప్రముఖ సంఘ సేవకులు మహ్మద్ నియమితుల్లా శనివారం మృతి చెందారు. గత కొన్ని రోజులుగా నగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ప్రముఖ న్యాయ వాది ఎం.డి.హబీబుల్లా నియమితుల్లా కుమారుడు. నియమితుల్లా మృతి పట్ల విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బేవర సత్యనారాయణ, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, సభ్యుడు నరసింగ రావు, పలువురు సీనియర్ న్యాయవాదులు, న్యాయమూర్తులు సంతాపం వ్యక్తం చేశారు.

పుష్పాలంకరణలో దుర్గాలమ్మ



పుష్పాలంకరణలో దుర్గాలమ్మ అమ్మవారు

డాబాగార్డెన్స్: పూర్ణామార్కెట్‌లోని వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ అమ్మవారి దేవస్థానం వార్షిక జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలు ఈ నెల 27వరకు కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా దుర్గాలమ్మ అమ్మవారు శనివారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భవానీ మాలధారులు మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక కుంకుమ పూజలు, ప్రత్యేక అర్చనలతో పాటు పంచామృతాభిషేకం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సౌభాగ్యలక్ష్మి అలంకరణ (గాజులతో)లో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు..



కుటుంబ సభ్యులతో రామకృష్ణ

సీతమ్మధార: రాజమండ్రి దరి నరేంద్రపురానికి చెందిన కాకర రామకృష్ణ (36) పనికి ఆహార పథకంలో పనిచేసి ఒక అధికారి దగ్గర అవమానాలకు గురయ్యాడు. కలత చెంది ఊరు వదిలి విజయనగరం వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు అతన్ని వెతికి పట్టుకుని ఇంటికి తీసుకెళ్లారు. అతని మానసిక పరిస్థితి సరిగా లేక రెండోసారి విశాఖ వచ్చేసాడు. అతన్ని ఏయూటీడీ సిబ్బంది గుర్తించి శ్రద్ధా ఫౌండేషన్ ద్వారా చికిత్స చేయించారు. 40 రోజుల్లో అతను కోలుకోవడంతో అక్క, బావ వివరాలు చెప్పాడు. వెంటనే అతని బావ శ్రీనును రప్పించి రామకృష్ణను క్షేమంగా అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

పంచాయతీల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్



తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న పంచాయతీ కార్యదర్శి

మహారాణిపేట: జిల్లాలో అన్ని మండలాల్లో ఉన్న గ్రామ పంచాయతీల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టారు. రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ప్రారంభం అయిన ఈ కార్యక్రమం ఆదివారం కూడా జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా క్లాప్‌మిత్రలు ప్రతి ఇంటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరించి ప్రజలకు అవగాహన కల్పించాలని డీపీవో తెలిపారు. పంచాయతీ విస్తరణాధికారులు, కార్యదర్శులు, ఈవోలు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ ఆలయం వద్ద గోతులు పడిన రహదారి

అభివృద్ధి పనుల పేరిట ఎక్కడికక్కడ చేపట్టిన పనులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో ప్రయాణికులు అవస్థలకు గురవుతున్నారు. కంచరపాలెంలోని పలు చోట్ల ఎక్కడ చూసినా తవ్వి వదిలేసిన రహదారులే దర్శనమిస్తున్నాయి. దీంతో వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి శిథిల రహదారులకు మరమ్మతులు చేయాలని వాహన చోదకులు, పాదచారులు కోరుతున్నారు.

అధ్వాన రహదారులతో.. అవస్థలు



అధ్వానంగా తయారైన జ్ఞానాపురం బీఆర్‌టీఎస్ సబ్‌వే

- గోతులమయంగా బీఆర్‌టీఎస్ రోడ్లు, వీధులు
- వాహన చోదకులు, పాదచారుల ఇక్కట్లు
- స్పందించని అధికారులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో కాలనీలు, బీఆర్‌టీఎస్ పలు రహదారులు అధ్వానంగా మారాయి. సరైన నిర్వహణ లేకపోవడంతో పాటు అభివృద్ధి పనుల పేరిట ఎక్కడికక్కడ చేపట్టిన పనులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జ్ఞానాపురం బీఆర్‌టీఎస్ సబ్‌వేలో ఆయా ప్రాంతాల ప్రజలకు 24/7 మంచినీటి సరఫరా చేసేందుకు తీసిన గోతుల్లో పైపులు అమర్చి గోతులు సక్రమంగా పూడ్చకుండా వదిలేశారు. మంచినీరు సరఫరా చేసేందుకు అవసరమైన పనులు చేపట్టారు. కంచరపాలెం నేతాజీ కూడలి ఫ్లైఓవర్ నుంచి భారత ఆహార గిడ్డంగి సంస్థ రహదారి, జ్ఞానాపురం ఎర్రిగెడ్డ, రైల్వే స్టేషన్, ఎర్నిమాంబ ఆలయం, కాన్వెంట్ కూడలి, చావుల మదుం వంతెన వరకు గల బీఆర్‌టీఎస్ రహదారిపై భారీ గోతులు తవ్వి గొట్టాలు అమర్చారు. పనులు పూర్తయిన తర్వాత బీటీ రహదారి నిర్మాణం చేపట్టకుండా, మట్టితో కప్పేసి వదిలేశారు. తారు రోడ్డు సంగతి ఎలా ఉన్నా.. కనీసం గోతులు సక్రమంగా కప్పకుండా మట్టి, రాళ్లతో వదిలేశారు. ఎర్నిమాంబ ఆలయం, బీఆర్‌టీఎస్ సబ్‌వే మంగళ, బుధ, ఆదివారాల్లో భక్తులతో కిటకిటలాడుతుంటాయి. అటుగా వాహన చోదకులు, భక్తులు పెద్ద సంఖ్యలో ప్రయాణం చేస్తుంటారు. శిథిల రహదారుల వల్ల ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రధాన వీధుల్లోనూ ఇదే పరిస్థితి..

జ్ఞానాపురం పరిధిలో గల బాబూకాలనీ, జేఎస్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, రావులపల్లి, సెబాస్టియన్ కాలనీ, కొండవీధి, సాలివీధి, గెడ్డవీధి తదితర ప్రాంతాల్లోని రహదారుల్లో భూగర్భ డ్రైనేజీ పేరిట భారీగా తవ్వకాలు చేపట్టారు. అవసరమైన చోట భూగర్భంలో పైపులైన్లు ఏర్పాటు



కాన్వెంట్ కూడలిలో గోతులమయంగా మారిన రైల్వే స్టేషన్ బస్టాండ్ ప్రాంతం

చేశారు. కొన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించినా.. మరికొన్ని ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం విస్మరించారు. పనులు జరుగుతున్న సమయంలో 2024 సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో సీసీ రహదారి నిర్మాణం మరిచారు. దీంతో నిత్యం రాకపోకలు సాగించే పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత జోన్–5 ఇంజినీరింగ్ అధికారులు స్పందించి రహదారుల్లో గోతులు పూడ్చి అవసరమైన చోట, బీటీ, సీసీ రహదారులు నిర్మించాలని వాహన చోదకులు, స్థానికులు కోరుతున్నారు.



చావులమదుం వంతెన వద్ద మట్టి, రాళ్లు తేలిన రహదారి

రాకపోకలకు ఇబ్బంది..

జ్ఞానాపురంలో రహదారులు గోతులమయంగా మారాయి. పనులు చేపట్టిన ప్రాంతాల్లో రహదారులను అసంపూర్తిగా వదిలేశారు. అటుగా రాకపోకలు సాగించేటప్పుడు ప్రమాదాలు బోటు చేసుకుంటున్నాయి. భయపడుతూనే ప్రయాణాలు చేస్తున్నాం. అధికారులు స్పందించాలి.

– వి. పార్వతి, జ్ఞానాపురం

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు..

కాన్వెంట్ కూడలి నుంచి జ్ఞానాపురం వరకు తవ్విన గోతులు పూడ్చాలని సచివాలయ ఉద్యోగులు, ఇంజినీరింగ్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. రహదారుల నిర్మాణం చేపట్టాలి.

– వెలల చిట్టిబాబు, స్థానికుడు, జ్ఞానాపురం

వన్‌టౌన్ సీఐకి ప్రశంసలు



వన్‌టౌన్ సీఐకి ప్రశంసా పత్రం అందజేస్తున్న సీపీ

డాబాగార్డెన్స్: శాంతి భద్రతల పరిరక్షణ, పోలీస్ సేవల విస్తరణలో కీలక పాత్ర పోషించిన వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (సీఐ) జీడీ బాబుకు పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి శనివారం ప్రశంస పత్రం అందజేసి అభినందించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం, ప్రజలకు పోలీస్ సేవలు సమర్థవంతంగా అందివ్వడం వంటి అంశాల్లో ఇన్‌స్పెక్టర్ చేపట్టిన కృషి ప్రశంసనీయమని కొనియాడారు. ప్రజల భద్రతకు చేపట్టిన చర్యలు గుర్తించి ప్రశంసించారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో 60 కేజీల గంజాయి స్వాధీనం



నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయితో జీఆర్పీ, ఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వే స్టేషన్ మీదుగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ముగ్గురిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విశాఖపట్నం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సిబ్బందితో కలిసి శనివారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఢిల్లీకి చెందిన బినా, పూజా అరోరా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బరేలి జిల్లాకు చెందిన వివేక్ విశాఖపట్నం స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ముగ్గురినీ అదుపులోకి తీసుకుని, వారి నుంచి 60 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

పోస్టాఫీసు చట్టం–2023ను ఉపసంహరించుకోవాలి

సీతమ్మధార: పోస్టాఫీసు చట్టం–2023ను తక్షణమే ఉపసంహరించుకోవాలని పీజేసీఏ చైర్మన్ కృష్ణప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం వాల్తేరు ఆర్‌ఎస్‌హెచ్ పోస్టాఫీసు నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐపీఈయూ, ఎన్‌ఎఫ్‌పీఈ సంఘాల గుర్తింపు రద్దు ఉత్తర్వులపై జార్ఖండ్ హైకోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్‌ను తక్షణమే అమలు చేయాలన్నారు. ఎల్–2 మెయిల్ ఆఫీసులను తిరిగి పునరుద్ధరించాలని, 12 ఆఫీసుల్లో ఐసీహెచ్, పీహెచ్‌లను తిరిగి ప్రవేశపెట్టాలని, కరోనా సమయంలో మూసేసిన ఆర్‌ఎంఎస్ ట్రాన్సిట్ సెక్షన్లను పునరుద్ధరించాలని అన్నారు. జీడీఎస్‌లకు సివిల్ సర్వెంట్స్ హోదా ఇవ్వాలని తెలిపారు. జీడీఎస్‌లను 8వ వేతన కమిటీలో చేర్చాలని, పెన్షన్, మెడికల్ ఫెసిలిటీ, సర్వీస్ బెనిఫిట్స్ కల్పించాలని అన్నారు. రేషనలైజేషన్ పేరుతో రద్దు చేసిన 1520 పోస్టులను తిరిగి మంజూరు చేయాలన్నారు. ఈ ర్యాలీలో పీజేసీఏ కన్వీనర్ ఎస్.దాసు, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

24న ఘంటసాల స్వర నీరాజనం

అల్లిపురం: ఈ నెల 24వ తేదీన జరగనున్న ఘంటసాల స్వర నీరాజనం సినీ సంగీత విభావరిని విజయవంతం చేయాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి కోరారు. సూర్యాబాగ్‌లోని తన కార్యాలయంలో శనివారం దానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఎన్.కె.మహంతి, చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ అమర గాయకుడు ఘంటసాల 51వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 24 సాయంత్రం 6 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘంటసాల స్వర నీరాజనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సినీ, కళా, సామాజిక సేవా రంగాలకు సేవలందిస్తున్న డాక్టర్ కంచర్ల అచ్యుతరావుకు కళామిత్ర బిరుదు ప్రదానం చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ప్రముఖ సంగీత విద్వాంసుడు చిప్పాడ సోమేష్ సంగీత నిర్వహణలో ఘంటసాల సినీ సంగీత విభావరి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సినీ, కళా, రాజకీయ రంగాల ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఎన్ఎస్ఎన్ రెడ్డికి ఘన నివాళి

సీతమ్మధార: ఎన్ఎస్ఎన్ రెడ్డి స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ శాసన సభ్యుడు, విశాఖ నగర పాలక సంస్థ ప్రథమ మేయర్ స్వర్గీయ ఎన్ఎస్ఎన్ రెడ్డి 95వ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ గాంధీ పార్కులో ఉన్న ఆయన విగ్రహానికి ట్రస్ట్ ప్రతినిధులు, కుమారులు నీలాపు వివేకానందరెడ్డి, విజయానందరెడ్డి ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విశాఖ నగరాన్ని ఎన్ఎస్ఎన్ రెడ్డి ఎంతో అభివృధి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, ప్రకాశ్‌రెడ్డి, వేమన సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహేశ్వరరెడ్డి, కోశాధికారి సంజీవరెడ్డి, బైరెడ్డి పోతన్నరెడ్డి, బోర కుమార్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ధర్మేంద్రరెడ్డి, దివాకర్‌రెడ్డి, రామారెడ్డి, సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్వర్గీయ ఎన్ఎస్ఎన్ రెడ్డి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న పలువురు నాయకులు

అభాగ్యునికి ఆశ్రయం

అల్లిపురం: అనాథలా వీధుల్లో తిరుగుతున్న గంటా రామకృష్ణ అనే వ్యక్తికి 33వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి రాము ఆశ్రయం కల్పించారు. టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల జీవీఎంసీ నిరాశ్రయ వసతి గృహం నిర్వాహకులతో మాట్లాడి అతనికి ఆశ్రయం కల్పించారు.



అనాథను వసతి గృహ నిర్వాహకులకు అప్పగిస్తున్న పచ్చిరిపల్లి రాము

నానిపై చర్యలు తీసుకోవాలని వినతి



సీపీకి ఫిర్యాదు చేస్తున్న ఏఐవైఎఫ్ ప్రతినిధులు

అల్లిపురం: బెట్టింగ్ యాప్‌ల ద్వారా డబ్బులు సంపాదించవచ్చని ప్రమోట్ చేస్తున్న యూట్యూబర్ లోకల్‌బాయ్ నానిపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్షుడు కె. అచ్యుతరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.రాంబాబు పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి ఫిర్యాదు చేశారు. శనివారం వారు పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీని కలిసి సోషల్ మీడియా వేదికగా నగరానికి చెందిన యూట్యూబర్ లోకల్‌బాయ్ నానీ లక్షలాది మంది యువతను తప్పుదోవ పట్టిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. యువతను తప్పుదోవ పట్టిస్తున్న యూట్యూబ్ ఇన్‌ఫ్లుయిన్సర్లు, లోకల్ బాయ్ నానీ, ఆయన భార్య, వీడియో చిత్రీకరించిన వారిని గుర్తించి తక్షణమే అరెస్టు చేయాలని కోరారు.

ఆలయాలకు శివరాత్రి శోభ

- 26న నీలమ్మ వేపచెట్టు అమ్మవారి వార్షిక ఉత్సవం
- 27న చినదుర్గాలమ్మ, పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ ఉత్సవం

అల్లిపురం: నియోజకవర్గంలో శివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఈ మేరకు ఇప్పటికే సంబంధిత దేవాలయ కమిటీలు, అధికారులు సన్నాహాలు పూర్తి చేశారు. వారితో పాటు భక్తులు కూడా ఎవరికి వారు అమ్మవార్ల ఘటాలు తీసుకువచ్చి పూజలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు.

26న నీలమ్మ వేపచెట్టు అమ్మవారి జాతర..

అస్సాంగార్డెన్స్‌లో వెలసిన శ్రీ నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానంలో మహాశివరాత్రి వార్షిక జాతర మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు. 25వ తేదీ మంగళవారం అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సందర్భంగా తెల్లవారి 6 గంటల నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి అనంతరం కుంకుమ పూజలు చేస్తారు. సాయంత్రం 4 నుంచి అమ్మవారి తిరువీధి ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం అమ్మవారి మాలధారులు అగ్నిగుండ ప్రవేశం చేయనున్నారు. 26వ తేదీన ప్రధాన జాతర ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి క్షీరాభిషేకం, కుంకుమ పూజల అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనాలు కల్పించనున్నారు.



నీలమ్మ వేపచెట్టు అమ్మవారు



అచ్చియ్యమ్మపేట చిన దుర్గాలమ్మ అమ్మవారు

27న దుర్గాలమ్మ అమ్మవారి వార్షిక జాతర..

పూర్ణామార్కెట్ దరి దుర్గాలమ్మ అమ్మవారి వార్షిక శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 26వ తేదీన అమ్మవారి తొలేళ్ల ఉత్సవం అత్యంత వైభవంగా చేపట్టనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. మంగళవారం తెల్లవారి 5 నుంచి అమ్మవారికి కుంకుమార్చనలు, శూలాల పండగ, భక్తుల అగ్నిగుండం ఉంటుందని తెలిపారు. రాత్రి 12 గంటలకు అమ్మవారి నేత్రోత్సవం అనంతరం తొలిపూజ అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. 27వ తేదీన అమ్మవారి జాతర మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ దేవాలయంలో అమ్మవారి విగ్రహం ప్రత్యేకమని చెప్పాలి. వేపచెట్టు మొద్దునే విగ్రహంగా మలిచారు. దాదాపు వంద సంవత్సరాలు పైబడిన చరిత్ర ఈ దేవాలయానిది అని భక్తులు చెబుతారు.

అబ్రకదబ్ర

- నేడు ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం
- 10 మంది ప్రముఖ మెజీషియన్లకు అవార్డుల ప్రదానం

డాబాగార్డెన్స్: లేనిది ఉన్నట్టు..ఉన్నది లేనట్టు చేయడమే ఇంద్రజాలం. మనిషిని గాల్లో వేలాడదీయం.. క్షణంలో ఏనుగును కళ్ల ముందు ప్రవేశపెట్టడం.. కళ్లు మూసుకుని తెరిచేలోపు మాయం చేయడం.. చేతి రుమాల్లోంచి పావురాలు సృష్టించడం మ్యాజిక్.. భారతీయ 64 కళల్లో ఇంద్రజాలం ఒకటి. ఈ కళకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన వారు..ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికుడు పీసీ సర్కార్. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఫిబ్రవరి 23న ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

నేడు 10 మంది ప్రపంచ మెజీషియన్ల ప్రదర్శన..

ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం, ఇండియన్ మ్యాజిక్ అకాడమీ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు నగరంలోని కళాభారతి ఆడిటోరియం వేదికగా 10 మంది ప్రముఖ ప్రపంచ మెజీషియన్లు ప్రదర్శన ఇవ్వనున్నారు. సాయంత్రం 6 నుంచి నాన్‌స్టాప్‌గా 3.30 గంటల పాటు ప్రదర్శన చేపట్టనున్నారు. ప్రపంచ ప్రఖ్యాత భారతీయ మహేంద్ర జాలికుడు పీసీ సర్కార్ తనయుడు, జూనియర్ పీసీ సర్కార్‌కు ఐఎంఏ జీవన సాఫల్య పురస్కారంతో పాటు 10 మంది దేశ, విదేశీ మెజీషియన్లకు ఐఎంఏ అవార్డులు ప్రదానం చేయనున్నారు.



ఇంద్రజాల ప్రదర్శనలో ప్రముఖ మెజీషియన్ బీఎస్ రెడ్డి

మ్యాజిక్..నాలుగు విధాలు..



ఇంద్రజాలం నాలుగు భాగాలుగా ఉంటుంది. క్లాసిక్, కన్జ్యూరింగ్, క్లోజప్, ఎలీసన్ విభాగాలుగా ఉంటాయి. పురాతన పద్ధతిలో మామిడి టెంకలు నాటి అప్పటికప్పుడే మొక్కలు పుట్టించడం, వాటికి కాయలు కాయించడం వంటివి క్లాసిక్‌గాను, ఎదుటి వ్యక్తితో మాట్లాడుతూనే అతి దగ్గరగా ఇంద్రజాలం ప్రదర్శించడాన్ని క్లోజప్‌గా గుర్తించారు. ఖాళీ డబ్బాల నుంచి వివిధ రకాల వస్తువులు తీయడం ఎలీసన్‌గాను, ఏదైనా ఒక వస్తువు స్వరూపాన్ని మార్చి తిరిగి దాని పూర్వ స్వరూపం తేవడాన్ని కన్జ్యూరింగ్‌గా గుర్తించారు. ఐఎంఏ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని పీసీ సర్కార్ జూనియర్‌కు ఐఎంఏ జీవన సాఫల్య పురస్కారం అందజేయనున్నాం.

– బీఎస్ రెడ్డి, ఇంద్రజాలికుడు, ఇండియన్ మ్యాజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు

మ్యాజిక్‌తో పాటు హాస్యం పండించాలి



నగరంలో ప్రొఫెషనల్ మెజీషియన్‌గా గుర్తింపు పొందడం చాలా ఆనందంగా ఉంది. ఇప్పటి వరకు 4 వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చా. జాదూ సామ్రాట్ అవార్డు పొందా.. తనకు చేతనైన సేవలు చేస్తున్నాను. ఇండియన్ మ్యాజిక్ అకాడమీ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలలో మూఢనమ్మకాలను పారదోలేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నా..క్షుద్ర విద్యలు, బాబాలు, దెయ్యాల వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నా. సాధారణ మ్యాజిక్‌తో పాటు కామెడీ మ్యాజిక్‌లు చేయాలన్నది లక్ష్యం. మూడు పీజీలు చేశా. ఏయూలో ఎంఎస్సీ సైకాలజీ కూడా పూర్తి చేశాను. గతేడాది బెస్ట్ మెజీషియన్ అవార్డు (లైమ్‌లైట్) అందుకున్నా.

–అన్వర్ బాషా, మెజీషియన్

స్ట్రీట్ మెజీషియన్ వద్ద ఇంద్రజాలం నేర్చుకున్నా..

ఒక స్ట్రీట్ మెజీషియన్ వద్ద 1971లో ఇంద్రజాల విద్యనభ్యసించి, దేశం నలుమూలల ప్రదర్శన ఇస్తూ, ఎంతో మంది మన్ననలు పొందా. నా హాబీ ఇంద్రజాలం. గ్రేట్ మెజీషియన్ పీసీ సర్కార్ సన్నిహితుడ్ని. ఇంద్రజాల ప్రదర్శన ద్వారా నన్ను ప్రోత్సహిస్తూ ఎవరైనా పారితోషికం ఇస్తే అనాథాశ్రమాలకు ఉపయోగిస్తున్నా. ఇప్పటి వరకు అనేక సత్కారాలు పొందాను. మామిడి టెంకను మట్టిలో పాతి, అప్పటికప్పుడు మొక్కను సృష్టించి కాయలు పూయించి స్టేజీపై చూపించగలను.

– కె.విజయ్‌కుమార్, మెజీషియన్, డిప్యూటీ మేనేజర్, ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్, వైజాగ్ స్టీల్‌ప్లాంట్